ఎక్కడ చూసినా కన్నీరే

- ఇంకా ముంపులోనే పలు ప్రాంతాలు
- శ్రీరాంనగర్‌లో వరద/మురుగు నీరు
- ఇళ్లు విడిచిన కుటుంబాలు..
- పాడైన నిత్యవసరాలు, గృహోపకరణాలు
- కాలువ తవ్వి.. నీటిని పంప్ చేసి
- ముంపు ప్రాంతాల్లో హైడ్రా చర్యలు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన రంగనాథ్


శ్రీరామ్ నగర్‌లో నిలిచిన వరదనీరు

హైదరాబాద్ సిటీ/రాంనగర్/చిక్కడపల్లి/కవాడిగూడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిండా వరద/మురుగు నీరు. దుర్వాసనతో ఊపిరాడని దుస్థితి. నీళ్లు ఎప్పుడు వెళ్తాయా? అని మూడు రోజులుగా నిరీక్షణ. చిన్నారులు ఒక చోట.. పెద్దలు మరో చోట.. కంటి మీద కునుకు లేదు.. కష్టం తీరే పరిస్థితి లేదు. ఇదీ బాగ్‌లింగంపల్లిలో ముంపునకు గురైన శ్రీరాంనగర్‌లో పరిస్థితి.

హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలా నుంచి వరద నీరు అశోక్‌నగర్, గగన్‌మహల్‌లోని రోడ్లపైకి చేరింది. ఇళ్ల ముందు రెండు నుంచి మూడు అడుగుల మేర నీరు నిలవడంతో బయటకు వెళ్లలేని దుస్థితి. నిత్యం భారీ వర్షాలు కురుస్తుండడం.. నాలాలో ప్రవాహ ఉధృతి పెరిగి ముంపు తగ్గకపోగా క్రమేణా పెరుగుతోంది. ఇప్పటికీ ఆయా ప్రాంతాలు ముంపులోనే ఉన్నాయి. వర్షం తగ్గినా కొన్ని చోట్ల మురుగు రాక ఆగలేదు. దీంతో మూడు రోజులుగా కొన్ని కుటుంబాలు ఇళ్లు, వాకిలి వదిలి సమీపంలోని కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలలు, బంధువులు, పరిచయస్తుల నివాసాల్లో తల దాచుకుంటున్నారు. బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్ ఇంకా ముంపులోనే ఉంది. బుధవారం రాత్రి 15 సెం.మీల వర్షపాతం నమోదు కావడంతో ముషీరాబాద్ నియోజకవర్గంలోని శ్రీరాంనగర్, అశోక్‌నగర్, దోమలగూడలోని గగన్‌మహల్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. శ్రీరాంనగర్‌లో రహదారిపై నుంచి వెళ్లే పారిశ్రామిక వ్యర్థాల పైపులైన్ లీకేజీతో ముంపు తీవ్రత పెరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ఇళ్లలోకి పారిశ్రామిక వ్యర్థాలు



పైప్‌లైన్ స్థలాన్ని కబ్జా చేసిన స్థలంలో హైడ్రా ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు


వరద నీటితోపాటు దుర్వాసన వస్తోన్న పారిశ్రామిక వ్యర్థాలూ ఇళ్లలోకి చేరాయి. బస్తీలోని ప్రతి వీధిలో మోటార్లను ఏర్పాటుచేసిన హైడ్రా నీటిని పంపింగ్ చేసింది. ఇప్పటికీ మూడు వీధుల్లో నీళ్లు అలానే ఉన్నాయి. నీళ్లు తగ్గిన చోట కొన్ని కుటుంబాలు ఇళ్లు శుభ్రం చేసుకుంటున్నాయి. నిత్యావసరాలు, దుస్తులు, గృహోపకరణాలు, మంచాలు, పిల్లల పుస్తకాలు నీటిలో తడిచాయని అరుణ అనే మహిళ వాపోయారు. 'అందరూ వచ్చి చూసి వెళ్లే వారే.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపరు. ఈ విపత్కర పరిస్థితుల్లో మాకు సాయమూ అందించడం లేదు' అని పేర్కొన్నారు. శ్రీరాంనగర్‌లో 2000 సంవత్సరం, 2020లో నీళ్లు వచ్చాయని, ఇంత ఇబ్బంది ఎప్పుడూ లేదని రమేష్ చెప్పారు. హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలాలోకి వరద నీరు వెళ్లేందుకు నిర్మించిన పైపులైన్ పూడుకుపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు.

ముంపు ప్రాంతాల్లో హైడ్రా పర్యటన


నాలాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్

ముంపు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం పర్యటించారు. 'శ్రీరాంనగర్ బస్తీలో నిలిచిన వరద/ మురుగు నీటితో 450 ఇళ్లు ముంపునకు గురయ్యాయి. డీఆర్ఎఫ్ బృందాలు భారీ మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తున్నాయి. ఓ వీధిలో మోటార్ ఏర్పాటుచేసినా.. అవుట్‌లెట్ లేకపోవడంతో ఏం చేయలేని దుస్థితి నెలకొంది. దీంతో బస్తీ నుంచి సమీపంలోని హుస్సేన్ సాగర్ సర్‌ప్లస్ నాలాలోకి నీరు వెళ్లేలా ఖాళీ స్థలం మీదుగా శుక్రవారం ప్రత్యేకంగా కాలువ తవ్వించాం.' అని రంగనాథ్ తెలిపారు. శాశ్వతంగా సమస్య పరిష్కారానికి పైపులైన్/ బాక్స్ డ్రైన్ నిర్మించే అంశాన్ని పరిశీలించనున్నట్టు ఆయన చెప్పారు. ఇందిరాపార్కు నుంచి వచ్చిన వరద చేరడంతో అశోక్‌నగర్‌లోని పలు రోడ్లు నీట మునిగాయి. సర్‌ప్లస్ నాలాకు ఆనుకొని ఉన్న దేవాలయం ప్రహరీ కూలడంతో వరద నీరు కాలనీలోకి వచ్చింది. ప్రహరీ గోడ పునరుద్ధరణతోపాటు.. నాలా విస్తరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.


ఇంకా జలమయంలో వీధులు



మంత్రులకు 25న ఫార్మాసిస్ట్ డే వేడుకల ఆహ్వానం

నల్లకుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీన నగరంలో నిర్వహించే వేడుకలకు హాజరు కావాలని శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రులను తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, రాష్ట్ర అసోసియేట్ జాలిగామ అశోక్ ఆహ్వానించారు. రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్‌చోంగ్‌ను అసోసియేషన్ నేతలు కలిసి వేడుకలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్‌బాబు, అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వి.శ్రీహరి, ఎస్.ఆనంద్‌కుమార్, రాబర్ట్‌ల బ్రూస్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తేనే గుర్తింపు

ముషీరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థ నేతలు ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధానకార్యదర్శి, బీహెచ్ఈఎల్ రిటైర్డ్ సీనియర్ మేనేజర్ ఆర్.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని బైబిల్‌హౌస్ యూపీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ, శక్తివంతమైన కుటుంబం పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకంలో భాగంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నందుకు వైద్యాధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్యను పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం వైద్య శిబ్బందికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎస్ వనిత, ఏఎన్ఎంలు లక్ష్మీబాయి, లత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో సేవాపక్వాడ్

ముషీరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన సేవాపక్వాడ్ కార్యక్రమంలో భాగంగా భోలక్‌పూర్‌లోని రంగానగర్, పద్మశాలికాలనీలలో బీజేపీ నాయకులు రోడ్లను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ మాట్లాడుతూ... స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ భోలక్‌పూర్ డివిజన్ కన్వీనర్‌లు నిత్యానంద్, వీరేష్‌గుప్తా, దిశాకమిటీ సభ్యుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

బర్కత్‌పుర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ 320బీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త స్పెన్సర్‌లాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడ తుల్జాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... లయన్స్‌క్లబ్‌లో జరిగిన నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించిన ఓ మహిళాసభ్యురాలిని లయన్స్ క్లబ్ నుంచి విరుద్ధంగా తొలగించారని, ఇది బైలాస్‌కు విరుద్ధమని ఆయన ఆరోపించారు. సామాజిక కార్యకర్త రాజుతో కలిసి ఆయన మాట్లాడుతూ... నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆరుగురిపై కేసు దాఖలు చేశామని తెలిపారు.

సీసీ రోడ్ల పనులను ప్రారంభించాలి: కార్పొరేటర్

బర్కత్‌పుర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో మంజూరైన సీసీరోడ్ల పనులను వెంటనే చేపట్టి పూర్తిచేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. శుక్రవారం నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్ కుమార్, ఏఈ ప్రశాంత్‌తో కలిసి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దని, దీనివలన స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతారని ఆమె చెప్పారు. బతుకమ్మ, దసరా వేడుకలు రాబోతున్న సందర్భంగా రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని, ప్యాచ్‌వర్కు పనులను వెంటనే చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్లలో కాలం చెల్లిన వస్తువులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లోని పలు సూపర్ మార్కెట్లలో జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. 44 మార్కెట్లలో తనిఖీలు నిర్వహించి.. పరీక్షల నిమిత్తం 58 నమూనాలను నాచారంలోని రాష్ట్ర ఫుడ్ లేబరేటరీకి పంపారు. సైదాబాద్‌లోని మోర్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గడువు ముగిసిన యాపిల్ ప్యాక్, కాచిగూడ ఎక్స్ రోడ్డులోని రిలయన్స్ లిమిటెడ్‌లో గడువు ముగిసిన అవకాడో, యాపిల్, ఆరెంజ్ ప్యాక్‌లు, కొండాపూర్‌లోని విజేత సూపర్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎల్లోరింగ్స్, పాలక్ రైస్‌పాపడ్, గోద్రెజ్‌జెర్సీ ధిక్‌షేక్, కొండాపూర్ రాజరాజేశ్వరనగర్‌లోని కేపీఎన్ ఫ్రెష్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అంబికా హోంఫుడ్స్‌కు చెందిన డ్రైఫ్రూట్ పూత రేకులు, చక్కెర గవ్వలు, బెల్లం సున్నుండలు, ఎనిమిది గ్రీన్ యాపిల్, కొండాపూర్‌లోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో దీపిక జున్ను, స్వీట్ కార్న్, కలర్ క్యాప్సికప్ మిక్స్ ప్యాకెట్లు గుర్తించారు. ఉల్లంఘనలకు పాల్పడినందుకు ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేసినట్టు జీహెచ్ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

హయ్యర్ పెన్షన్‌ను అందరికీ వర్తింపచేయాలి

బర్కత్‌పుర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా హయ్యర్ పెన్షన్ ఆప్షన్ చేసుకున్న వారందరికీ అమలు చేయాలని హైదరాబాద్ సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ డిమాండ్ చేసింది. బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయం వద్ద శుక్రవారం పెన్షన్‌దారులు, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ సెక్టార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సౌందర్‌రాజన్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... పెన్షన్లు రూ.12వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.



రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ గౌతంరావు


రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు, లంకల దీపక్‌రెడ్డి తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. రక్తం కొరత వల్ల నిరుపేద రోగులు ప్రాణాలు కోల్పోతున్నారని, వారి ప్రాణాలను కాపాడడానికి విస్తృతంగా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఆయన కోరారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సేవాపక్షంలో భాగంగా బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో శుక్రవారం బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ... ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 (గాంధీ జయంతి) వరకు విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి యెడెల్లి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిక్కడపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పథకం ఒక వరంలాంటిదని దాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. నియోజకవర్గంలోని 55 మంది లబ్ధిదారులకు రూ.18.09లక్షల విలువైన చెక్కులను ఆయన క్యాంప్‌కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠా జైసింహ, బీఆర్ఎస్ వివిధ డివిజన్‌ల అధ్యక్షులు ఎం.రాకేష్‌కుమార్, టి.శంకర్ ముదిరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తున్న దత్తన్న


దత్తాత్రేయకు వీసీడీని అందజేస్తున్న డా.ధర్మారావు

చిక్కడపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తున్న ప్రజల మనిషి బండారు దత్తాత్రేయ అని ఇట్క్లా, ఫాస్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు డా.కె.ధర్మారావు అన్నారు. మాజీ గవర్నర్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయతో దశాబ్దాల పరిచయం ఉన్న క్రమంలో శుక్రవారం ధర్మారావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మారావును దత్తాత్రేయ అభినందిస్తూ దశాబ్దాల కాలంగా ధర్మారావు కళా, సాహితీ, సాంస్కృతికరంగాల సేవ అభినందనీయమన్నారు. ఈసందర్భంగా ధర్మారావు తన సాంస్కృతిక జీవితప్రయాణాన్ని దత్తాత్రేయకు వివరించి, ఇందుకు సంబంధించిన వీసీడీని అందజేశారు.

వడ్డాణాన్ని రిపేర్, పాలిష్ చేయని వ్యక్తి రిమాండ్

చిక్కడపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ బంగారు వడ్డాణం రిపేర్, పాలిష్ కోసం ఇవ్వగా దాన్ని తిరిగి ఇచ్చే విషయంలో కష్టమర్‌ను సతాయించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి క్రైమ్ పోలీసులు సదరు షాప్ ఓనర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి 183 గ్రాముల బంగారు వడ్డాణాన్ని స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి డీఐ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిక్కడపల్లికి చెందిన ఎం.చంద్రరేఖ తన కుమార్తెతో కలిసి చిక్కడపల్లిలోని చంద్రకాంత్ జ్యూయలర్స్‌కు గత జూలై 23న వెళ్లి 422 గ్రాముల బంగారు ఆభరణాలు (లాంగ్ చైన్, రెండు చైన్‌లు, చెవిరింగులు, లాకెట్, వడ్డాణం) పాలిష్, రిపేర్‌చేయాలని ఇచ్చారు. అయితే 26న వడ్డాణం మినహా మిగతా ఆభరణాలు రిపేర్, పాలిష్‌చేసి చంద్రరేఖకు చంద్రకాంత్ ఇచ్చాడు. అదే నెల 31న చంద్రకాంత్ వద్దకు వెళ్లి వడ్డాణం ఇవ్వాలని కోరగా పని పూర్తవలేదని చెప్పడంతోపాటు ప్రతిసారి సతాయించడం, బెదిరించడం చేస్తున్నాడు. దీంతో బాధితురాలు చిక్కడపల్లి క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని చంద్రకాంత్‌ను అదుపులోకి తీసుకుని 183 గ్రాముల బంగారు వడ్డాణాన్ని రికవరీ చేశారు. చంద్రకాంత్‌ను రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ అభిలాష్ కేసు దర్యాప్తు చేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

కవాడిగూడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దాదాపు 70 సంవత్సరాల వయస్సు గల ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకొని గాంధీమార్చురీకి తరలించినట్లు గాంధీనగర్ ఎస్ఐ నరసింహ తెలిపారు. గాంధీ ఆస్పత్రి ఎదురుగా మెట్రో పిల్లర్ 1032 వద్ద గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం పడి ఉందని, 100 డయల్ ద్వారా సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు వెంటనే సంఘటనా చేరుకొని ఆయన మృతదేహాన్ని పరిశీలించారు. దాదాపు 70 సంవత్సరాల వయస్సుల గల వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడు స్థానికంగా యాచిస్తూ ఉండేవాడని, ఆయన ఆచూకీ తెలియదని స్థానికులు తెలిపారని ఎస్ఐ నరసింహ చెప్పారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు వెంటనే గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గానీ లేదా ఫోన్ నెంబర్ 8712660145లో గానీ సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

లోతట్టు ప్రాంతాల్లో ప్రమాద సూచిక బోర్డులు



పార్శిగుట్ట ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక ఫ్లెక్సీ


వినోభానగర్ నాలాను పరిశీలించిన బీఆర్ఎస్ రాష్ట్ర నేత హరిబాబు యాదవ్

ముషీరాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల ముందు జాగ్రత్త చర్యగా ముషీరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలలో జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వినోభానగర్, పార్శిగుట్ట, ప్రేయర్‌పవర్ చర్చ్ వీధి, ఆశీర్వాద్ అపార్టుమెంట్ ఎంసీహెచ్ కాలనీ వీధులలో ప్రమాద సూచిక ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశామని జీహెచ్ఎంసీ ఏఈ మురళీ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వినోభానగర్ నాలాలో దినేష్ వరద నీటి ఉధృతికి కొట్టుకుపోవడంతో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాలా పరివాహక ప్రాంతాలైన లోతట్టు ప్రాంతాలలో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు వర్షాలు పడినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

దినేష్ ఆచూకీ గుర్తించాలి

బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ ముషీరాబాద్ వినోభానగర్ నాలాలో కొట్టుకుపోయిన దినేష్ ఆచూకీని హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే గుర్తించాలని బీఆర్ఎస్ రాష్ట్ర మాజీకార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వినోభానగర్ నాలాను పరిశీలించి దినేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆరు రోజులు అయినా దినేష్ ఆచూకీ లభించకపోవడం బాధాకరమన్నారు. పేదింటికి చెందిన దినేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిది రాతిగుండె

- అరగంట చిక్కడపల్లి లైబ్రరీలో చదవండి
- నిరుద్యోగ విద్యార్థుల సమస్య తెలుస్తుంది:ఆర్ఎస్పీ


పోటీపరీక్షల అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

చిక్కడపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డిది రాతి గుండె కాకపోతే ఒక్కడిగా వచ్చి ఒక అరగంట చిక్కడపల్లి లైబ్రరీలో చదవండి, నిరుద్యోగ విద్యార్థుల సమస్య తెలుస్తుంది అని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఐపీఎస్ మాజీ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. నిరుద్యోగుల సమస్యలు తెలుసుకోవడానికి శుక్రవారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా నిరుద్యోగులతోపాటు కలిసి లైబ్రరీలో గంటపాటు పుస్తకాలను చదివారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఏమీ చదువుకోలేదు కాబట్టి ఆయనకు ఏమీ తెలియదన్నారు. ఒక నేరస్థుడు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తారా బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పాటిస్తారా పోలీసులు ఆలోచించుకోవాలన్నారు. ప్రభుత్వం పంతానికి పోకుండా వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. గ్రూప్-1 అవకతవకలపై బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధిగా 'నేను మాట్లాడితే తప్పు ఏంటి' అని ప్రశ్నించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేసిన తప్పులనే మళ్లీ మళ్లీ చేస్తుందని కోర్టు తీర్పునిచ్చిందన్నారు. వెంటనే ప్రభుత్వం 50 వేల ఉద్యోగాలు మొదటి విడతగా నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు. ఆర్టికల్ 19(1) ప్రకారం నాకున్న స్వేచ్ఛతో ఇక్కడికి వచ్చానన్నారు. నేను దేశంలో ఎక్కడైనా తిరగవచ్చన్నారు.

బతుకమ్మకుంటకు తరలిరండి

- మాజీ ఎంపీ వి.హనుమంతరావు


బాగ్అంబర్‌పేటలో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు

రాంనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాగ్ అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో ఈ నెల 26న జరిగే బతుకమ్మ వేడుకలకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. శుక్రవారం డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్, రెడ్‌బిల్డింగ్, పోచమ్మబస్తీ, కుమ్మరబస్తీ తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించి, బతుకమ్మ వేడుకలకు కుటుంబ సభ్యులతో బతుకమ్మలతో హాజరు కావాలని కోరారు. 26న బతుకమ్మకుంటను, బతుకమ్మ వేడుకలను సీఎం రేవంత్‌రెడ్డి హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. కబ్జాకు గురైన బతుకమ్మకుంటను బీఆర్ఎస్ నేతల కబ్జా నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, 8 కోట్లతో పునరుద్ధరించిందని తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గం మహిళలందరూ బతుకమ్మకుంటకు వచ్చి బతుకమ్మ ఆడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, మాజీ కార్పొరేటర్లు పుల్లా నారాయణస్వామి, పులి జగన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డంశ్రీధర్‌గౌడ్, నాయకులు ప్రభాకర్, మహేష్‌కుమార్, సందీప్, కోట్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంటకు వీహెచ్ పేరు పెట్టాలి


బతుకమ్మ ఆడుతున్న ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఉషశ్రీ, మహిళలు

నిర్వీర్యమైన బతుకమ్మకుంటకు 35 సంవత్సరాలు పోరాడి, చెరువును పునరుద్ధరించడానికి కృషి చేసిన మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేరును పెట్టాలని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బాగ్అంబర్‌పేటలో శంభుల ఉషశ్రీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కబ్జాకు గురైన స్థలాన్ని వీహెచ్ సీఎం దృష్టికి తీసుకెళ్లి హైడ్రా సహకారంతో అంబర్‌పేట నియోజకవర్గం మహిళల చిరకాల కోరికను నెరవేర్చారని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు సునీతారెడ్డి, లావణ్య, పద్మ, శాంతమ్మ, కవిత, ఫాతీమా తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్ అకుంఠిత దీక్షతోనే బతుకమ్మకుంటకు విముక్తి



మాజీ ఎంపీ వి.హనుమంతరావు అకుంఠిత దీక్షతోనే బతుకమ్మకుంటకు విముక్తి కలిగిందని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం బాగ్అంబర్‌పేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బతుకమ్మకుంట స్థలాన్ని కబ్జాదారుల మెడలు వంచి చెరువును పునరుద్ధరించడంలో వీహెచ్ చేసిన పోరాటం వెలకట్టలేమన్నారు. వీహెచ్ కృషి అంబర్‌పేట చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఈనెల 26న సీఎం చేతుల మీదుగా ప్రారంభం కానున్న బతుకమ్మకుంట చెరువు కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని కోరారు.